కాంగ్రెస్, బీజేపీలకు అభివృద్ధి అవసరం లేదు

- కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు
- అల్లాపూర్ డివిజన్‌లో ప్రజా ఆశీర్వాద ర్యాలీ
- అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు అభ్యర్థన




అల్లాపూర్ డివిజన్‌లో ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కూకట్‌పల్లి అభ్యర్థి మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి గురువారం ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అల్లాపూర్ డివిజన్‌లో హిందూ, ముస్లింలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ఆదర్శంగా ఉన్నారన్నారు. అందుకు కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ అవలంభిస్తున్న విధానాలే కారణమన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఏనాడు కూడా ప్రజల సంక్షేమం కోసం ఆలోచించిన పాపాన పోలేదన్నారు. ఎప్పుడు కుల మత రాజకీయాలే తప్ప వారికి ప్రజల అభివృద్ధి, శాంతి భద్రతలు అవసరం లేదన్నారు.

అల్లాపూర్ డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచాం..

◆ అల్లాపూర్ డివిజన్‌లోని పదేళ్ల క్రితం వర్షం వస్తే రోడ్లు బురద మయంగా మారి ఎంతో అస్తవ్యస్తంగా ఉండేవని డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక ఒక మురుగు కుంటలా మారేదని అన్నారు. దానిని పూర్తిగా ప్రక్షాళన చేసిన నేడు అద్దాల్లాంటి రోడ్లు వేసి భూగర్భ పైపులైన్లతో సురక్షిత మంచినీరు అందిస్తున్నామని అన్నారు. నిరుపేదలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. నేడు ఆదర్శ నియోజకవర్గంగా మారిందంటే అది కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లనేనని అన్నారు. అందుకే రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించుకుందామని చెప్పారు. తనను ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మెడికల్ షాపుల యజమానుల మద్దతు..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావును గురువారం క్యాంపు కార్యాలయంలో మెడికల్ షాపుల యజమానులు కలిశారు. వారి పూర్తి మద్దతు మాధవరం కృష్ణారావుకు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో మాధవరం కృష్ణారావుకు ఓటు వేసి గెలిపించుకుంటామని తెలిపారు.



మాధవరం కృష్ణారావుతో మెడికల్ షాపుల యజమానులు

రేవంత్‌రెడ్డివి అసత్య ఆరోపణలు

- నిరూపిస్తే నేను దేనికైనా సిద్ధం
- నిరూపించకపోతే నువ్వు ఏం చేస్తావో చెప్పు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో కాంగ్రెస్ ప్రచారానికి వచ్చిన రేవంత్‌రెడ్డి అసత్యమైన వ్యాఖ్యలు చేశారని... అవి నిరూపిస్తే తాను దేనికైనా సిద్ధమని... నిరూపించుకోకపోతే రేవంత్‌రెడ్డి ఏం చేస్తారని మాధవరం కృష్ణారావు సవాల్ విసిరారు. కొడంగల్‌లో ఓడిపోయి మల్కాజ్‌గిరిలో అబద్ధాల మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిందన్నారు. మల్కాజ్‌గిరి రూపురేఖలు మారుస్తానన్న రేవంత్‌రెడ్డి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు మొహం కూడా చూపెట్టలేని దుర్మార్గుడని పేర్కొన్నారు.

◆ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూకట్‌పల్లి నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. కూకట్‌పల్లికి వచ్చి అబద్దాపు మాటలు మాట్లాడి వెళ్లిపోయే నాయకుడు నాయకుడేనా అన్నారు. కూకట్‌పల్లి ప్రజలు ఓట్లు వేసి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి గెలిచిన నాలుగు సంవత్సరాల్లో ఏనాడైనా కూకట్‌పల్లి నియోజకవర్గంలో అడుగు పెట్టాడా అని ప్రశ్నించారు.

◆ కరోనా సమయంలో కనీసం ప్రజల కష్టసుఖాలు తెలుసుకోలేని నాయకుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో 40 సంవత్సరాలుగా సేవలు చేస్తున్న వారికి టికెట్లు ఇవ్వకుండా కాంగ్రెస్ టికెట్లు అమ్ముకున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. అసత్య మాటలు మాట్లాడితే కూకట్‌పల్లి ప్రజలు ఊరుకోరని అలాంటి నాయకుడికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.

గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించండి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ రామకృష్ణ వీధిలో గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌యస్ అభ్యర్థి గాంధీ సతీమణి అరెకపూడి శ్యామలాదేవి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెకపూడి గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ భార్గవి, అరెకపూడి ప్రణీత, రంగారావు, భాస్కర్‌రావు, సంజీవరెడ్డి, పురేందర్ రెడ్డి, తాండవ కృష్ణ, కార్తీక్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించే బీజేపీకే ఓటు వేయండి

ఆల్విన్‌కాలనీ: ఎన్నికల్లో కేవలం మద్యం, డబ్బుతో బీఆర్‌యస్, కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రావాలని చూస్తున్నారని నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కుమార్ ఎద్దేవా చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ చౌరస్తా, పీజేఆర్‌నగర్ చౌరస్తాలలో ఆయన బీజేపీ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభ్యర్థి రవికుమార్‌యాదవ్‌కు మద్దతుగా గురువారం రోడ్ షో నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రవికుమార్ యాదవ్‌ని భారీ మెజార్టీ గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ కేసీఆర్ హామీలతో 9 సంవత్సరాలు ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడిపారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మ్యానిఫెస్టో హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో పదిమంది సీఎం అభ్యర్థులు ఉన్నారని వారు కుర్చీల కోసం పాకులాడటంలో ఉన్న శ్రద్ధ ప్రజలకు మేలు చేయాలన్న తపన ఉండదన్నారు. జోరు వర్షంలో కూడా పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్‌యాదవ్, రవీందర్‌రావు, చారి, కుమార్‌యాదవ్, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్‌గ్యాలరీలో ఇండియన్ ఫొటో ఫెస్టివల్

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో గురువారం ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు.ఈ ప్రదర్శనను హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 40 దేశాల నుంచి 2500 మంది ఫొటోగ్రాఫర్‌లు పాల్గొన్నారు. జనవరి 7 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సంతాప సభ

రాయదుర్గం: మనూ యూనివర్సిటీ కోల్‌కతా రీజనల్ సెంటర్ డైరెక్టర్ డా.ఇమామ్ ఆజమ్ గురువారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కాగా గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోనా పరిపాలనా భవనంలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సిద్ధిఖీ మహ్మద్ మహమూద్ మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి డాక్టర్ ఇమామ్ ఆజమ్ విలువైన సేవలను అందించారని గుర్తు చేశారు. అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో ఆరాధనోత్సవాలు

మాదాపూర్: శిల్పారామం ఆంపీ థియేటర్‌లో శుక్రవారం నుంచి మూడురోజులపాటు భరతవేద ఆర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దేంద్ర యోగి ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కూచిపూడి నృత్యాలతో సందర్శకులను అలరించనున్నారు. గురు వు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ శిష్య బృందం పాల్గొనుంది.

ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపోలో గురువారం సికింద్రాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాలు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, రీజన్ మేనేజర్ ఖుస్రు సో ఆలీఖాన్‌లో ముఖ్య అతిధులుగా పాల్గొని 11 డిపోల పరిధిలోని ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టీసీ డ్రైవర్స్ ప్రశాంతంగా ఉండాలని, ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేర్చే బాధ్యత డ్రైవర్‌పై ఉంటుందన్నారు. మంచి కేఎంపీఎల్ తీసుకువచ్చి డిపోలను అభివృద్ధి బాటలో నడపాలని కోరారు.

దళిత బహుజన పార్టీ అభ్యర్థులను గెలిపించండి

లిబర్టీ: పేద దళిత జనుల సమస్యలు పరిష్కారం కావాలంటే దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్, జాతీయ ఉపాధ్యక్షుడు సి.యాదగిరి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటర్లు రాజకీయ పార్టీల తాయిలాలకు లొంగకుండా నిజమైన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే చట్టసభల్లో ప్రజల వాదాన్ని వినిపిస్తారన్నారు. గురువారం పార్టీ అభ్యర్థుల కరపత్రాన్ని వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధాన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల అభ్యర్థులను ఓడించాలని కోరారు. డబ్బు, మద్యానికి తలొగ్గకూడదని విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ అభ్యర్థి శ్యామ్‌కుమర్ పాల్గొన్నారు.

రియల్టర్ ఇంట్లో చోరీ

వెంగళరావునగర్: పెళ్లికి వెళ్లి వచ్చేలోపు రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌కాలనీలో నివసించే వై.శ్రీరాఘవ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. నెల కిందట బంగారం, డైమండ్స్ తదితర వస్తువులు తన అల్మారాలో ఉంచి తాళాలు వేశాడు. ఈ నెల 23న వివాహానికి హాజరు కావానికి వెళ్లాడు. తిరిగి వచ్చి అల్మారాను చెక్ చేసుకోగా అతని వస్తువులు కనిపించలేదు. తన వద్ద పని చేసే రాములు అనే వ్యక్తిపై అనుమానం ఉందని, దాదాపు దాదాపు రూ. 5 లక్షలు ఖరీదు చేసే 20 తులాలు బంగారు, డైమండ్స్ వస్తువులు దొంగిలించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాక

కీసర: మేడ్చల్ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా రాంపల్లిలో నిర్వహించనున్న బహిరంగసభలో పాల్గొనేందుకు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శుక్రవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లికి విచ్చేయనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి తెలిపారు. రాజ్‌నాథ్‌సింగ్ మధ్యాహ్నం 12 గంటలకు రాంపల్లికి చేరుకొని మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏనుగు సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా బహిరంగసభలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

456 మంది ఓటేశారు

ఇంటి నుంచి ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు

దుండిగల్: ఇంటి నుంచే ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్నారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు నేరుగా ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 290 మంది వృద్ధులు, 166 దివ్యాంగులు మొత్తం 456 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తమ సిబ్బంది ఓటర్ల ఇంటికి వెళ్లి నేరుగా ఓటు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడిగా హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ నియోజకవర్గ కాంగ్రెస్ నేత జెడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని పీసీసీ మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. కొన్ని రోజులుగా అసంతృప్తితో ఉన్న ఆయనను డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్‌ఠాక్రే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని అన్నారు.

మాలల మద్దతు కాంగ్రెస్‌కే: చెన్నయ్య



బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆమెకు అండగా నిలబడదామని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. గురువారం బంజారాహిల్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. దళితుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసింది కాంగ్రెస్ మాత్రమే అని స్పష్టం చేశారు. ఆ పార్టీకి మాలలంతా అండగా నిలబడాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు.

మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు, బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, బల్వంతరావు, బత్తుల రాంప్రసాద్, గడ్డం శ్రీనివాస్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమోహన్‌కు నివాళి

సాక్షి, సిటీబ్యూరో: దివంగత నటుడు చంద్రమోహన్ సంస్మరణ సభ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. చంద్రమోహన్ మేనల్లుడు, ప్రముఖ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, చంద్రమోహన్ సతీమణి జలంధర, పెద్ద కుమార్తె మధుర, రెండో కుమార్తె మాధవి, మనువరాళ్లు చిన్మయి, శ్రీకర, నిర్మాత ఆదిశేషగిరిరావు, దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, గాయకుడు ఎస్పీ చరణ్, దర్శకులు రేలంగి నరసింహారావులు చంద్రమోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



నీటి నాణ్యతపై తనిఖీలు

ఫిలింనగర్: నీటి సరఫరా వేళల్లో నీటి నాణ్యతా పరిశీలన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ అన్నారు. గురువారం ఫిలింనగర్‌లోని బాల్‌రెడ్డినగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో పర్యటించి నీటి శాంపిల్స్‌ను సేకరించి నాణ్యతను పరిశీలించారు. నీటి సరఫరా వేళల్లో ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలన్న జలమండలి ఎండి దాన కిషోర్ ఆదేశాల మేరకు తాము ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హరి శంకర్ తెలిపారు. నీటి సరఫరా వేళల్లో పర్యటిస్తే సమస్యలను గుర్తించడంతో పాటు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.



వినాయకనగర్‌బస్తీలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

డంప్ చేసిన మద్యం సీసాలు స్వాధీనం



పోచారం: అనుమానాస్పద ప్రదేశాల్లో ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ నుంచి జవహర్‌నగర్ వెళ్లే దారిలో శివాలయం పక్కన అక్రమంగా డంప్ చేసిన 64 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో సిగ్నేచర్, అమెరికన్ ప్రైడ్, రిజర్వ్ విస్కీ బాటిళ్లు ఉన్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు పురుషోత్తంరెడ్డి, శ్రావణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. లిక్కర్ అమ్మకాలకు బిల్స్ ఇవ్వనందుకు కాప్రాలోని తేజ వైన్స్‌పై కేసు రాసినట్లు చెప్పారు.

ఏపీ అధికారులతో ఇఫ్లూ వీసీ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ నేతృత్వంలో అధికారుల బృంద ం ఇఫ్లూ వీసీ ప్రొ.ఇ.సురేష్ కుమార్‌తో గు రువారం సమావేశమయ్యారు. విద్యార్థుల కు వివిధ విదేశీ భాషలలో శిక్షణ ఇచ్చేందు కు మొదటి విడత చర్చలు జరిపారు. ఈ విషయమై త్వరలో ఏపీ ప్రభుత్వం, ఇఫ్లూ నడుమ ఒప్పందాలు ఎంఓయూ కుదుర్చుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఓడించాలని సీపీఐ జాతీయ నాయకులు నారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఓయూలో విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు ప్రభుత్వ వైఫల్యాలు రాబోవు ఎన్నికల్లో విద్యార్థుల కర్తవ్యం అనే అంశం పై చర్చ గోష్టి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులను గెలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు పుట్ట లక్ష్మణ్, నాయకులు లెనిన్, నెల్లి సత్య, ఎస్‌ఎఫ్ఐ నేత రవినాయక్, పీడీఎస్‌యూ నేత సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబ పాలన త్వరలో అంతం: తుమ్మల

వెంగళరావునగర్: తెలంగాణలో నిశబ్ద విప్లవం వచ్చిందని, త్వరలోనే సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతాన్ని ప్రజలు పాడబోతున్నారని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మధురానగర్‌కాలనీ సమీపంలోని వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... ఆకు రౌడీలకు ప్రజలు భయపడే ప్రసక్తేలేదని, ఈ నెల 30న అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పబోతున్నారని స్పష్టం చేశారు. తెలంగాణలో నివసించే ప్రతి ఒక్కరిదీ అని... ఈ తెలంగాణ కేసీఆర్ ఆయన కుటుంబీకుల జాగీరు కాదని అన్నారు. దేశవ్యాప్తంగా ఎంతో మంచి పేరు సంపాదించిన టీం ఇండియా మాజీ సారథి, మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్‌ను రాహుల్‌గాంధీ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టారని, ఆయనకు మనమంతా వెన్నుదన్నుగా నిలబడి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్‌తోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నవీన్‌యాదవ్, కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, పార్టీ సీనియర్ నేత భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

25న నడ్డా రోడ్ షో

ముషీరాబాద్: బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి పూస రాజుకు మద్దతుగా జాతీయ అధ్యక్షులు జె.పి.నడ్డా ఈ నెల 25న సాయంత్రం కల్పన థియేటర్ చౌరస్తా నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకు గాంధీనగర్ మీదుగా నిర్వహించనున్న రోడ్ షోను విజయవంతం చేయాలని బీజేవైఎం ముషీరాబాద్ కోకన్వీనర్ శ్యామ్ అన్నారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్ ఎన్నికల కార్యాలయంలో రోడ్‌షో వివరాలు వెల్లడించారు. నాయకులు అరవింద్, ధీరజ్, శ్రీను, వంశీ, శేఖర్, రాము, శ్రీకాంత్, బాలు పాల్గొన్నారు.

హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలి



కూకట్‌పల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న బండి రమేష్, వెంకటేశ్వరరావు



కూకట్‌పల్లి డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి రమేష్, లకుమాదే, సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని ఓల్డ్ శివాలయం, కూకట్‌పల్లి గ్రామం, రామయ్య నగర్, గాయత్రినగర్, కేరళ కాలనీ, దయార్‌గూడలో ప్రాంతంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ గురువారం ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సతీసమేతంగా ప్రచారం..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్, ఆయన సతీమణి లకుమాదేవి సతీసమేతంగా అయ్యప్ప స్వామి ఆలయంలో పూజలు చేసి కూకట్‌పల్లి డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... 2004 నుంచి 2014 వరకు సాగిన కాంగ్రెస్‌పాలనే బంగారమని, కేసీఆర్ బంగారు తెలంగాణ పాలన బూటకమని తేలిపోయిందని విమర్శించారు. తిరిగి కాంగ్రెస్ పాలన వస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ డా. సత్యం శ్రీరంగం, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, నాగరాజు, రమాదేవి, సరోజిని, కవిత, రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు..

బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బండి రమేష్ గురువారం ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు మధు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 50 మంది కార్యకర్తలు యువ వికాస్ పథకానికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ సత్యం శ్రీరంగం, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌కు సేవాభారతి అవార్డు

కాచిగూడ: బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన జొన్నగల శ్రీధర్ అందిస్తున్న సామాజిక సేవలను గుర్తించి శిఖరం ఆర్ట్ థియేటర్స్, ఉజ్వల కల్చరల్ ఆర్గనైజేషన్ సంస్థలు సంయుక్తంగా ఆయనకు సేవా భారతి నేషనల్ అవార్డును అందజేశాయి. ఈ సందర్భంగా గురువారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ తాను అందించిన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషకరమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు శ్రీధర్‌ను అభినందించారు.

కాంగ్రెస్‌కు ఓటు..వర్గీకరణకు చేటు



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఎస్సీ వర్గీకరణకు మాదిగలు మరింత దూరమవుతారని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. గురువారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల తో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేసిందన్నారు. వారికి ఓటు ద్వారానే సమాధానం చెప్పాలని మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 60 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాదిగల చిరకాల స్వప్నం అయిన ఎస్సీ వర్గీకరణ విషయంలో స్పష్టత ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికి వర్గీకరణ చేయకపోగా మాదిగ బిడ్డలను గాంధీ భవన్ సాక్షిగా పొట్టనపెట్టుకున్న కాంగ్రెస్ పార్టీని మాదిగలు బహిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో సైతం ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని ప్రకటించని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి మరోమారు మాదిగలను మోసం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. జీవన్, డి.శ్రీకాంత్, ఎల్.నాగరాజు, సురేష్, శ్రీనివాస్, రాజు, శ్రీకాంత్, రాజశేఖర్ పాల్గొన్నారు.